క్లుప్తంగా

గంగమ్మకు ప్రత్యేక పూజలు


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కారంచేడు: గ్రామ దేవత గంగమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కాబట్టి వేకువ జాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామదేవతగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న అమ్మవారికి విశేష పూజలతో పాటు, నైవేద్యాలు సమర్పించారు. పంటలు బాగా పండాలని, రైతన్నలు సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు. సంతాన లేమితో ఇబ్బందులు పడుతున్న ఆడపడుచులు సైతం అమ్మవారికి తమ మొక్కుబడులు చేసుకున్నారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పర్చూరు మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

పర్చూరు(చినగంజాం): పర్చూరు గ్రామ మాజీ సర్పంచ్, రాష్ట్ర సాహిత్య సాంస్కృతిక అకాడమీ మాజీ డైరెక్టర్ యద్దనపూడి హరి ప్రసాద్ తల్లి యద్దనపూడి సరోజిని మృతి పట్ల పర్చూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి సంతాపం తెలియజేశారు. ఆమె శనివారం అకస్మాత్తుగా గుండె పోటుతో చనిపోవడంతో సమాచారం అందుకున్న ఆయన తన సానుభూతిని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. సర్పంచ్‌గా ఆమె పర్చూరు అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆదివారం ఆమె మృతదేహాన్ని పర్చూరు మండల పార్టీ కన్వీనర్ కఠారి అప్పారావు, నాయకులు కోట శ్రీనివాసరావు, దాసరి వెంకట్రావు, కంచెనపల్లి రమేష్, లంకా శివ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

సంతాపం తెలిపిన బ్రహ్మానందరెడ్డి

పర్చూరు(చినగంజాం): పర్చూరు మాజీ సర్పంచ్ యద్దనపూడి సరోజిని మృతి పట్ల వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి సంతాపం తెలిపారు. పర్చూరు పంచాయతీ అభివృద్ధిలో ఆమె చేసిన కృషి మరువలేనిదన్నారు. తనకు వారు కుటుంబంతో గత 30 ఏళ్లుగా సన్నిహిత సంబంధాలున్నాయని, ఆమె మృతి తీరని లోటన్నారు.

నేడు నకిలీ మద్యం దందాపై ర్యాలీ

పర్చూరు(చినగంజాం): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి ఆధ్వర్యంలో నకిలీ మద్యం దందాపై సోమవారం పర్చూరులో ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలి, నకిలీ మద్యంపై సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడాలి అనే డిమాండ్‌లతో సోమవారం ఉదయం 10 గంటలకు పర్చూరు పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కార్యాలయం ఎదురు నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎక్సైజ్ అధికారికి వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమానికి నియోజక వర్గంలోని నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అద్దంకి: నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమలా తయారు చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నేడు పట్టణంలో ఉదయం 10 గంటలకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. నియోజకవర్గ సమన్వయకర్త చింతలపూడి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో, నియోజకవర్గ నాయకులతో, కార్యకర్తలతో కలసి నిర్వహించనున్నారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా బయలుదేరి, నాగులపాడ రోడ్డులోని ఎక్సైజ్ కార్యాలయం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ర్యాలీ అనంతరం ఎక్సైజ్ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తామని తెలిపారు.

ఇ- పంట నమోదు చేసుకోండి

బల్లికురవ: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలన్నింటినీ ఇ- పంటలో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు తెలిపారు. 20 రైతు సేవాకేంద్రాల పరిధిలో 80 శాతం మాత్రమే ఇ- పంట నమోదు పూర్తయిందని.. పంట ఉత్పత్తులను అమ్ముకోవడంతో పాటు విపత్కర పరిస్థితుల్లో పరిహారం పొందవచ్చని చెప్పారు. వీఏఏల ద్వారా నూరు శాతం ఇ- పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి కోరారు.

కార్పెంటర్లు పేర్లు నమోదు చేసుకోవాలి

అద్దంకి రూరల్: ఈ నెల 20వ తేదీ నుంచి 75 రోజుల పాటు రాజమండ్రిలో జరిగే ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ శిబిరానికి కార్పెంటర్లు పేరు నమోదు చేసుకోవాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల్లోపు వారు, కనీసం చదవటం, రాయడం వచ్చిన వారంతా అర్హులని తెలిపారు. వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకోనేందుకు కార్పెంటర్లు, వృత్తిపై ఆసక్తి కలిగినవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన కరువు

- లేఅవుట్ క్రమబద్ధీకరణకు ముందుకు రాని వైనం
- చీరాల మున్సిపాలిటీలో మూడు లేఔట్లు
- ఈనెల 24వ తేదీ లోపు దరఖాస్తులకు గడువు


చీరాల్లోని లే అవుట్

చీరాల అర్బన్: పురపాలక సంఘం పరిధిలో లేఅవుట్ రెగ్యులరైజేషన్ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) పథకానికి సంబంధించి స్పందన కరువైంది. అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఎల్‌ఆర్‌ఎస్‌పై విస్తృతంగా ప్రచారం నిర్వహించినా ఎవరూ ముందుకు రాకపోవడంతో మున్సిపల్ ప్రణాళికా విభాగం అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనధికార లేఅవుట్లు, ప్లాటుల క్రమబద్ధీకరణ పథకం 2020ను సవరణ ఉత్తర్వులను జారీ చేసింది. చీరాల మున్సిపాలిటీ పరిధిలో కుందేరు వద్ద మూడు లేఅవుట్లు ఉన్నాయి. కుందేరు కాలువ వద్ద రెండు, సంపత్ నగర్‌కు వెళ్లే రోడ్డులో గల కబేళా వద్ద ఒకటి లేఅవుట్లు ఉన్నాయి. వీటిని క్రమబద్ధీకరించేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు.

రాష్ట్రంలో ఈ ఏడాది జూన్ 30వ తేదీకి ముందు వేసిన అనధికార లేఅవుట్లలోని నిర్ణీత అపరాధ రుసుం, 14వ శాతం ఓపెన్ స్పేస్ ఖరీదు చెల్లించి క్రమబద్ధీకరించుకొనేందుకు అవకాశం కల్పించారు. అలానే ఎల్‌ఆర్‌ఎస్ 2020 పథకంలో దరఖాస్తులు దాఖలు చేసి పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్లను అర్జీదారులు బ్యాలెన్స్ ఫీజులు, డాక్యుమెంట్లు దాఖలు చేసి క్రమబద్ధీకరించేందుకు అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్ బాగా సాగిన రోజుల్లో వేసిన అక్రమ లేఅవుట్లలో విచ్చలవిడిగా ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే కొందరు ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే లేఅవుట్లు రూపొందించి విక్రయాలు సాగిస్తున్నారు. చీరాల్లోని కుందేరు పక్కన గల రెండు లేఅవుట్లు, కబేళా వద్ద ఒకటి ఉండగా వీటిని క్రమబద్ధీకరించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

క్షేత్రస్థాయిలో స్పందన కరువు..

క్రమబద్ధీకరణ ఫీజు, ఓపెన్ స్పేస్ చార్జీల్లోనూ రాయితీలు ప్రకటించినా ఆసక్తి చూపడం లేదు. అనుమతులు తీసుకోని లేఅవుట్లలో 2025 జూన్ 30వ తేదీ లోపు ప్లాట్ కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారంతా ఎల్‌ఆర్‌ఎస్‌కు అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. వీరంతా ఈనెల 24వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. కానీ చీరాల పురపాలక సంఘంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు క్షేత్రస్థాయిలో స్పందన లభించడం లేదు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ఫ్లెక్సీలు, కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించినా ఉపయోగం ఉండటం లేదు. సాధారణంగా ఏదైనా లేఅవుట్‌లో, వెంచర్లు రూపొందించినప్పుడు విధిగా వ్యవసాయ భూమి నుంచి కమర్షియల్‌గా మార్చేందుకు ల్యాండ్ కన్వర్షన్ (భూమి మార్పిడి) చేయాల్సి ఉంటుంది. అనంతరం అన్ని అనుమతులతో లేఅవుట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది.



లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలంటూ మున్సిపాలిటీ ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

దరఖాస్తు చేయకుంటే చర్యలు...

క్రమబద్ధీకరణ చేసుకోని అనధికార లేఅవుట్లు, ప్లాట్లులో ఏ విధమైన భవన నిర్మాణ అనుమతులు రావు. క్రమబద్ధీకరణ చేసుకోని అనధికార లేఅవుట్లు, ప్లాట్లు వివరాలను అమ్మకం, కొనుగోలుకు వీలులేకుండా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిషేధిత భూముల రిజిష్టరులో నమోదు చేస్తారు. విద్యుత్, నీటి సరఫరా, డ్రైయినేజీ కనెక్షన్లు ఇచ్చేందుకు వీలుండదు.

> **సద్వినియోగం చేసుకోవాలి**
>
> అనధికార లేఅవుట్లు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీంను యజమానులు సద్వినియోగం చేసుకోవాలి. చట్టబద్ధమైన క్రమబద్ధీకరణ లేఅవుట్లతో పాటు వాటిలోని ప్లాట్ల యజమానులకు అనేక ఉపయోగాలున్నాయి. భవన నిర్మాణ అనుమతులు, విద్యుత్, నీటి సౌకర్యం, డ్రైనేజీ వంటి సౌకర్యాలు అందుతాయి. ఈ పథకంపై విస్తృతంగా అవగాహన కలిగి ఉండి లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి. ఈనెల 24 వ తేదీ లోపు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందించాలి.
>
> – కె.శ్రీనివాసులు, టీపీఓ, చీరాల మున్సిపాలిటీ

ఏఎంఆర్ చెక్‌పోస్టుల్లో విధులు


ధర్మవరం చెక్ పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

బల్లికురవ: కూటమి ప్రభుత్వం గ్రానైట్, మెటల్, ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణకు అడ్డుకట్ట వేసేందుకు ఏఎంఆర్ సంస్థకు చెక్ పోస్టులు ఏర్పాటు చేసుకునే బాధ్యతను అప్పగించింది. రాయల్టీ చెల్లించకుండా అక్రమంగా తరలిస్తున్న వ్యాపారుల గొంతులో పచ్చి వెలక్కాయపడింది. బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు, అద్దంకి మండలాల పరిధిలో అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసేందుకు 54 చెక్ పోస్టులు చేశారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేయగానే అక్రమ రవాణాదారులు చెక్‌పోస్టు అద్దాలను ధ్వంసం చేశారు. నెలకు ప్రభుత్వానికి రూ. 47 కోట్లు చెల్లించేలా రెండు సంవత్సరాలు ఒప్పందం చేసుకుని ఒక్కో చెక్‌పోస్టు ముగ్గురు చొప్పున ఆపరేటర్‌లను నియమించారు. వారం రోజులగా కేటాయించిన ప్రాంతాల్లో ఆపరేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. రాయల్టీ వసూళ్లను ప్రైవేటు సంస్థకు అప్పగించటం ఏమిటని గ్రానైట్ వ్యాపారులు తర్జనభర్జన పడుతున్నారు. ఇప్పటికి కట్టర్ సైజుకు రూ. 35 వేలు రాయల్టీ చెల్లిస్తున్నామని అదనంగా చెల్లించాలంటే తమ ఫ్యాక్టరీలు పూర్తిగా మూసివేయాల్సిందేనని పరిశ్రమ నిర్వాహకులు వాపోతున్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటులో భాగంగా నిరసన వ్యక్తం చేస్తూ అక్రమ రవాణాదారులు సెప్టెంబర్ మాసాంతంలో మల్లాయపాలెం, కొణిదెన ధర్మవరంలో ఏర్పాటు చేసిన కంటేనర్ అద్దాలను ధ్వంసం చేశారు. ఈ పరిస్థితుల్లో ఏఎంఆర్ చెక్ పోస్టులతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడితే ప్రభుత్వానికి ఆదాయం పెరిగినట్లే.

పంచాయతీ కార్యదర్శుల సమావేశం నేడు

చీరాల టౌన్: కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.విజయ ఆదివారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా హాజరుకావాలని సూచించారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న రెవెన్యూ ఉద్యోగుల సమావేశానికి విధిగా రెవెన్యూ సిబ్బంది, అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని విచారణ వివరాలు, నీటి తీరువా వసూళ్లు, రెవెన్యూ సమస్యల పరిష్కారంపై నిర్వహిస్తున్న సమావేశానికి రెవెన్యూ సిబ్బంది విధిగా తగిన రికార్డులతో హాజరు కావాలని సూచించారు.

వయోవృద్ధులు దైవ సమానులు


దాతలను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

చీరాల: సమాజంలోని వయోవృద్ధుల్ని దైవసమానులుగా గౌరవించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చీరాల శాఖ అధ్యక్షుడు గాదె హరిహరరావు అన్నారు. ఆదివారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ప్రపంచ వృద్ధుల దినోత్సవానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. చీరాల ప్రాంతంలోని వృద్ధుల సంక్షేమం కోసం తమ సంస్థ పలు కార్యక్రమాలను దాతల సహకారంతో నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా చీరాల ప్రాంతంలోని వివిధ సామాజిక కార్యక్రమాల నిర్వహణకు సహకరిస్తున్న కట్టా రాజీవినయ్ కుమార్, కట్టా నాగేశ్వరి భాస్కర్, జరీ నాగేశ్వరరావు, కొమ్మూరి ఆంజనేయులు, బుద్ధి సుబ్బరామయ్య, జంపాల గంగాధరరావు, యం.రామచంద్రయ్య, గండూరి వీరబ్రహ్మాన్ని సంస్థ తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యస్.యల్లమందారెడ్డి, ఎ.నాగవీరభద్రాచారి, ఎ.రామారావు, వూర మస్తాన్‌రావు, బత్తుల బ్రహ్మారెడ్డి, పి.శివాంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ఘన పూజలు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారు

చీరాల టౌన్: భక్తుల కొంగు బంగారం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన తోటవారి పాలెం పోలేరమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. బాపట్ల, ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామాన్ని సుభిక్షంగా ఉంచడంతో పాటుగా కోరిన కోర్కెలు తీర్చే పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు సౌకర్యాలను కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేశారు.

ప్రమాద భరితంగా విద్యుత్ స్తంభాలు


కిందకు వేళ్లాడుతున్న విద్యుత్ వైర్లు

జె.పంగులూరు: మండల పరిధిలోని కల్లవారి పాలెం సమీపంలో విద్యుత్ స్తంభాలు ప్రమాద భరితంగా మారాయి. గ్రామం నుంచి చిన్నమల్లవరం వైపు వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభాలు, వైర్లు కిందకు వంగి ప్రమాద భరితంగా మారాయి. అంతేకాక విద్యుత్ వైర్ల నుంచి చిన్నచిన్న మంటలు కూడా వస్తున్నాయి. విద్యుత్ స్తంభం పొలంలో ఉండటం వలన రైతులు ఆ వైపు పోవాలంటే భయపడిపోతున్నారు. ఏ క్షణానైనా వైర్లు తెగి పడవచ్చని రైతులు తెలుపుతున్నారు.

విద్యుత్ సంబంధిత అధికారులు కల్లవారిపాలెం వెళ్లాలంటే ఆ మార్గం నుంచి గ్రామం లోకి వెళ్లాలి. ఎప్పుడు ఆ స్తంభాల నుంచి విద్యుత్ వైర్లు కాలిపోతున్న శబ్దాలు వస్తుంటాయి. కానీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు, గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కారించాలని కోరుకుంటున్నారు.

ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


విశ్రాంత ఉద్యోగలను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వేటపాలెం: రామాపురం సముద్రతీరం వద్ద రాజా రిసార్టులో బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజీ 1979-1982 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొన్నారు. వారి చిన్ననాటి తీపుగుర్తులను నెమరు వేసుకున్నారు. ఉద్యోగస్తులకు రిటైర్మెంట్ అనేది జీవతంలో ఒక భాగమేనన్నారు. తాము చదువుకున్న పాఠశాలకు చెందిన విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించడానికి వారికి స్కాలర్‌షిప్‌లు ఇవ్వడానికి ముందున్నారని కొనియాడారు. దంతం మోహనరావు, టీఎస్ఎన్ మూర్తి, శరత్, రమేష్ పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం ఆశ్వీయూజ మాసం ఆరుద్ర సప్తమి సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అవుతాయా?


ముక్తేశ్వరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆటలు ఆడిస్తున్న ఉపాధ్యాయులు



పీడీ పోస్టుకు ఖాళీగా ఉన్న కొప్పరపాడు ఉన్నత పాఠశాల

బల్లికురవ: మండలంలోని 58 పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అవుతాయా లేదా అని తల్లిదండ్రులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పెదఅంబడిపూడి ఉన్నత పాఠశాల మినహా 10 ఉన్నత పాఠశాలలో 4 నెలలుగా వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. క్రీడల్లో విద్యార్థులు ఆసక్తి చూపలేక పోతున్నారు. వీటితోపాటు వైదన ఉర్దూ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయ పోస్ట్‌తో కలిపి 23 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్ని పాఠశాల్లో కలిపి 222 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు పశ్చిమ ప్రాంతానికే ఎక్కువగా కేటాయించినట్లుగా తెలుస్తోంది. సోమవారం కొత్త ఉపాధ్యాయులు పాఠశాలల్లో అడుగు పెట్టనున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులన్నింటికీ ఉపాధ్యాయులు కేటాయింపు జరిగితే విద్యార్థుల కష్టాలు తీరినట్లే. వ్యాయమ ఉపాధ్యాయులు లేనందున విద్యార్థులతో ఉపాధ్యాయులే ఆటలు ఆడించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

చెరువు కట్టపై ఫెన్సింగ్ ఏర్పాటు


చెరువు కట్టపై ఫెన్సింగ్ ప్రారంభిస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు(చినగంజాం): మండలంలోని నాగులపాలెం చెరువు కట్టపై రూ. 3 లక్షల ఖర్చుతో రోటరీ క్లబ్ సహకారంతో ఆర్‌సీసీ నాగులపాలెం నిర్మించిన ఫెన్సింగ్ ఆదివారం ప్రారంభించారు. చెరువులో నీరు కలుషితం కాకుండా పశువులు చెరువు నీటిని పాడు చేయకుండా ఫెన్సింగ్ రక్షణ కల్పిస్తుందని రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. కార్యదర్శి కోమటి ఆంజనేయులు, తేళ్ళ రమేష్‌చంద్ర, కొల్లా నరేంద్ర కుమార్, కొల్లా సుబ్బారావు, కొల్లా కొండలరాయుడు, పోలిశెట్టి చంద్రశేఖర్‌రావు, ఆర్‌సీసీ ప్రెసిడెంట్ రాఘవయ్య, చాగంటి నాగేశ్వరరావు, కొల్లా శ్రీనివాసరావు, అడ్డగడ చిన్న నాగేశ్వరరావు, కొలసాని శ్రీనివాసరావు, అడ్డగడ రఘుబాబు, మండూరి కృష్ణ, తాగంటి రామారావు, కొల్లా సురేష్ పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు


స్వర్ణ-చీరాల రోడ్డులో గోదామును పరిశీలిస్తున్న సీఐ రమణయ్య

కారంచేడు: దీపావళి పండుగ సమీపిస్తున్న తరుణంలో ఇంకొల్లు పోలీస్ సర్కిల్ పరిధిలో కారంచేడు మండలంలో ఉన్న రెండు టపాసుల గోదాములను ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన కారంచేడు పరిధిలో కారంచేడు-చీరాల రోడ్డులోని గోదాముతో పాటు, స్వర్ణ-చీరాల దండుబాట రోడ్డులోని మరో గోదామును కూడా స్థానిక పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలను అవసరమైన అన్ని రకాల అనుమతులతో పాటు బట్టి ఫైర్ సేఫ్టీ వంటి అనేక విషయాలను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. అలాగే ధరల విషయంలో కూడా పట్టికలు వినియోగదారులకు అందుబాటులో ఉంచాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనకోని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజల ప్రాణాలతో పాటు, ప్రజా ఆస్తులకు నష్టం కలిగించని విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కారంచేడు ఏఎస్ఐ శేషసాయి, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవం

చినగంజాం: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శత జయంతి, విజయదశమి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చినగంజాం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ భావన్నారాయణ స్వామి దేవస్థానంలో ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవానికి జిల్లా కార్యకారిణ్ కోట శంకర నారాయణ పాల్గొని తమ సందేశం అందజేశారు. చీరాల ఖండ ప్రచారక్ శ్రీరామ్ మాధవ్, చినగంజాం మండల ప్రచారక్ దండుప్రోలు వెంకట్రావు, షేక్ జిలాని, వెంకటేశ్వర్లు, నటరాజ్, నూనె సత్య నారాయణ, ఉలిచి ఏసుబాబు పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు నాగూర్‌బీ

సంతనూతలపాడు: అనంతపురంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు షేక్ నాగూర్‌బీ కోరారు. మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యంలో ఆదివారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఐద్వా జెండాను మండల కమిటీ సభ్యురాలు షేక్ మస్తాన్‌బీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షేక్ నాగూర్‌బీ మాట్లాడుతూ ఐద్వా పోరాట ఫలితంగా మహిళల హక్కుల సాధన కోసం అనేక చట్టాలు సాధించుకున్నామన్నారు. రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి 600 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. జిల్లా నుంచి కూడా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీహెచ్ సునంద, షేక్ ఫరీదాబీ తదితరులు పాల్గొన్నారు.